నారాయణమ్మ భర్తను హాస్పటల్‌కు తీసుకొచ్చి బయట కూర్చోబెట్టి లోపల వున్న డాక్టర్ దగ్గర కొచ్చి చటుక్కున మట్టుకుపోయి బావురుమని ఏడ్చింది. డాక్టరు కంగారుపడి యిదేదో బాగుందే అనుకుని భార్య గుర్తుకొచ్చి "నా భార్య కూడా డాక్టరే. ఇదే హాస్పటల్‌లో పనిచేస్తున్నది. చూసిందంటే ఇంజెక్షన్ యిచ్చి మరీ చంపుతుంది. నీకు నా మీద మరీ మనసైతే సాయంత్రం ఏడుగంటలకొస్తే నా భార్య వుండదు. ప్రస్తుతానికి వదులు వదులు" అన్నాడు డాక్టరు మరింత హత్తుకుంటూ.

అంతలో డాక్టరమ్మ గబగబా వచ్చి డాక్టర్ నెత్తిన ఒక్కటి మొట్టింది. డాక్టరు ఉలిక్కిపడి నారాయణమ్మను వదిలి "హి... హి... నేనేం చేయలేదు. స్టెతస్కోపు కనిపించడంలేదు. ఆమె గుండెను పరిక్షిస్తున్నానంతే" చెప్పాడు మెల్లగా.

"మీ కిలాంటి బుద్ధులున్నాయని తెలిసే చేతికి రూపాయి యివ్వకుండా జాగ్రత్తపడుతున్నాను. ఏమే తిప్పలాడి వాటేసుకోవటానికి నా మొగుడే దొరికాడా? నాకున్నది ఒక్కడే మొగుడు. ఇద్దరికీ కంబైన్డ్‌గా ఇంజెక్షన్ యిస్తాను చచ్చారుకుంటారు" అంటూ వెళ్ళబోయింది.

అంతలో నారాయణమ్మకు వచ్చిన పని గుర్తుకొచ్చి ఓ వెర్రికేక వేసి మరోసారి బావురుమన్నది. ఉలిక్కిపడిన డాక్టరు నారాయణమ్మ భుజాలు పట్టుకుని కుదిపి కుదిపి అడిగాడు. డాక్టరమ్మ కసికసిగా చూసి రుసరుసలాడుతూ "మీకు డబుల్ డోసిచ్చి మరీ చంపుతాను" కళ్ళెర్రచేసి పళ్ళు పటపట కొరుకుతూ కోపంగా అన్నది.

"అంత పని మాత్రం చేయకమ్మ తరువాత తెల్లబట్టలు కట్టుకొని జీవితాంతం అనుభవించాల్సి వుంటుంది. విన్నదానివి చెప్పినా అర్థం కాదు" అన్నది నారాయణమ్మ కళ్ళు వత్తుకుంటూ

"నాన్‌సెన్స్. నాకలాంటి ఖర్మలేదు. ఆ వెధవ సెంటిమెంట్స్ నాకసలు గిట్టవు". అంటూ గబగబా వెళ్ళి చకచకా ఓ దున్నపోతుకిచ్చేటంతటి డోస్ సిరంజిలోనికి ఎక్కిస్తున్నది.

"ఇంతకు ఏమైందో చెప్పుచెప్పు" కంగారుపెట్టాడు డాక్టరు.

"కొంపలంటుకున్నాయి డాక్టరు గారూ..."

"కొంపలంటుకుంటే ఫైర్ స్టేషన్‌కు ఫోన్ వేయాలి. అంతే కానీ, ఇక్కడ కొచ్చి నన్నెందుకు వేపుకు తింటావు. అసలే మా ఆవిడ ఇంజెక్షన్ ఇచ్చి మరీ చంపుతానంటోంది" లబలబలాడిపోయాడు డాక్టరు.

"అదిగాదు డాక్టరుగారూ! ఒకసారి మా వారిని చూడండి చచ్చేలా వున్నారు" అంటూ చేయి పట్టుకుని బరబరా ఈడ్చుకుపోయింది నారాయణమ్మ.

ఇంజెక్షన్ పట్టుకుని డాక్టరమ్మ వెనకే బయలుదేరింది.

అప్పటికే బెడ్‌మీద పడుకోబెట్టివున్న గున్నారావు మూలుగుతున్నాడు. అతని గుండు నిండా బొప్పెలు కట్టి, ఆ బాధలు తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నాడు.

"ఏవమ్మా! చూస్తుంటే మనిషి చాలా అమాయకుడిలా వున్నాడు. గుండుగీకించి మరీ బాదినట్లున్నావు. దేనితో బాదావేమిటి? డాక్టరు ముక్కుమీద వేలు వేసుకుని జాలిగా అడిగాడు.

# శఠగోపం

"ఏం చెప్పను డాక్టరు గారూ! చెబితే మీరంతా నవ్వుతారు మరి" అన్నది నారాయణమ్మ కళ్ళు మరోసారి వత్తుకుని.

"అదిగో అలా మాట మాటకీ కళ్ళనీళ్ళు పెట్టుకోకు. ఆ నీళ్ళు క్రిందపడితే అశుభంగా వుంటుంది. అసలే మా హాస్పటల్ స్టాఫ్ తక్కువగా వున్నారు" ఇందాక కంగారులో వినలేదు. ఈయన నీకేమవుతారు" అడిగాడు డాక్టరు.

"ఎవర్నో నేనెందుకు తీసుకొస్తానండి. మావారే".

"మా వారే అంటున్నావు. నువ్వాయిన కేమవుతావు? కన్‌ఫ్యూజింగ్‌లో అడిగాడు.

"ఏమవుతుందా? ఒకసారి పాంట్ విప్పండి. కుంటి మీద ఈ దున్నపోతు డోసంత ఇంజెక్షన్ యిస్తాను అప్పుడు తెలుస్తుంది" గయ్ మన్నది డాక్టరమ్మ వచ్చి

"నేను బయటకెళతాను" అన్నది నారాయణమ్మ సిగ్గుతో వంకర్లు తిరిగిపోతూ.

"ఎందుకు?" అన్నాడు డాక్టరు.

"ఎందుకేమిటి మీ ఆవిడ పాంట్ విప్పమంటున్నది కదా! నాకసలే సిగ్గు బాబూ!" మోహం మీద పైట చెంగు గప్పుకుని మరీ అన్నది నారాయణమ్మ.

"మీరు పాంట్ విప్పండి" గద్దించింది డాక్టరమ్మ.

"అమ్మమ్మ మరచిపోయాను పది నిమిషాలు ఆగమ్మా. మా వారికి కాస్త ట్రీట్‌మెంట్ యిచ్చిన తరువాత నీ పని ముగించుకో" బతిమాలింది నారాయణమ్మ.

"ఇంతకు నీ భర్తకు ఏమైందో వివరంగా చెబితే కానీ నేను ట్రీట్‌మెంట్ యివ్వలేను. జరిగింది చెప్పు డాక్టరు నారాయణమ్మ భుజాలు పట్టుకుని గబగబా కుదపబోయి ప్రక్కన ఇంజెక్షన్ పట్టుకుని నిలబడివున్న భార్యను చూసి ఆగిపోయాడు.

"చెబుతాను డాక్టరు గారూ! కాస్త మీరు కూడా అలా నాతోపాటు అలా ఫ్లాష్ బ్యాక్ లోనికి రండి" అన్నది నారాయణమ్మ.

"వీల్లేదు ఇప్పుడు ఫ్లాష్‌బ్యాక్ లోనికి రమ్మంటావు. రేపు ఇంటికి రమ్మంటావు. నేను ఇంజెక్షన్ వేసి చంపాల్సిందే" అరిచింది డాక్టరమ్మ.

★★★★

గున్నారావు అర్ధరాత్రి నిద్రలో ఉలిక్కిపడి లేచి కూర్చుని నోరు తెరచి పెద్దగా భజన చేయడం మొదలెట్టాడు. నిద్రలో వున్న నారాయణమ్మ భయంగా ఉలిక్కిపడి లేచి విరాగ్గా భర్తను చూసి తక్కున నోరుమూసి "ఏం రోగం వచ్చింది? అర్థరాత్రి నిద్రలేచి ఈ భజనలేమిటి? బంగారం లాంటి నిద్ర పాడయిపోయింది" విసుక్కున్నది.

"కలలో దేవుడు కనిపించాడు నారీ! మనం రేపు తీర్థయాత్రలకు బయలుదేరుతున్నాం. గుడులు గోపురాలు చూసివద్దాం" నోటి కడ్డం వున్న నారాయణమ్మ చేతి లాగి మరీ చెప్పాడు గున్నారావు.

నారాయణమ్మ ఆనందంగా హ్హర్ అని అరచి భర్తను మట్టుకుపోయి కితకితలు పెట్టింది. విషయమేమిటంటే దేవుడంటే అస్సలు గిట్టని గున్నారావు దేవుడి మీద ఒక్కసారే భక్తి ముంచుకు రావడం.

★★★★

తిరుమలలో గున్నారావు భార్యను కాటేజిలో వదిలి గుండు చేయించుకుందామని ఓ గంట క్యూలో నిలబడి నెంబర్ ప్రకారం క్షురకారుడి వద్దకెళ్ళి నమస్కరించి కూర్చున్నాడు. "నమ


స్కారం దేవుడికిచ్చి, దయగల ప్రభువులు నాలుగు కాసులివ్వండి'' అన్నాడతను. గున్నారావు జేబులో వెతికి వెతికి ఓ రూపాయి తీసి యిచ్చాడు. అతను ఎగాదిగా చూసి ''మహాదాతలు తమరిదే వూరేంటి?'' నెత్తిన నీళ్ళు భళ్ళున గుమ్మరించి అడిగాడు గున్నారావు హుందాగా చెప్పాడు.

''అవునవును తమరిని చూస్తుంటే తెలుస్తూనే వుంది. ''నెత్తిన ఒక్కటి బాది బాగ్‌లోని తుప్పుపట్టిన కత్తిని బయటకు తీసి బరబరా మని పెద్ద శబ్దం వచ్చేలా గీకుతుంటే మంటతో గిలగిల లాడాడు గున్నారావు.

''ఏమిటి బాబూ మీ తలంతా గుంటలు పడిన రోడ్డులా వున్నది. మీ ఆవిడకు బుఱ్ఱ చదును వేయడం వచ్చినట్లులేదే! ఒకసారి మీ ఆవిడను మా ఆవిడ దగ్గరకు పంపండి. చక్కగా నేర్పుతుంది'' అన్నాడతను.

''అమ్మో! తల మండుతోంది తెగిందా ఏమిటి ఖర్మ'' బాధతో మళ్ళీ గిలగిల లాడాడు గున్నారావు.

''గతుకుల రోడ్డుమీద వెళుతుంటే సైకిళ్ళు




ఫంక్చర్ అవడం మామూలె కదా నాలుగు గాట్లు పడ్డాయంతే!''

''చర్మం వలిచి కారం పూచినట్లున్నది కాస్త నెమ్మదిగా వేయవయ్యాబాబూ!'' విలవిల లాడాడు గున్నారావు.

''రూపాయి యిచ్చి మెల్లగా వేయాలా? అంటూ మరింత వేగం పెంచాడు.

గున్నారావు అబో దిబోమని మొత్తుకున్నప్పటికి అతను స్పీడు తగ్గించలేదు.

★★★★

తిరుమలలో మొక్కులు తీర్చుకుని తిరుపతి చేరుకుని అక్కడినుండి మంగాపురం చేరుకున్నారు భార్య భర్తలు. ఓగంట క్యూలో నిలబడి గర్భగుడిలోని అలివేలు మంగమ్మను దర్శించుకుని బయట కొస్తుంటే అక్కడ నిలబడి వున్న పూజారి తీర్థం యిస్తుంటే గున్నారావు భక్తిగా చేయి జాపాడు. పూజారి ఎడం చేయి చూపుతూ డబ్బులు అడిగాడు.

గున్నారావు నవ్వి ''తీర్థం యివ్వండి స్వామీ'' అని అడిగాడు.

''నడవండి, నడవండి'' అన్నాడు పూజారి తీర్థం యివ్వకుండా.

నారాయణమ్మ భర్త చెవిలో గుసగుసలాడింది కానుక వేయమని.

గున్నారావు అవునా అని ఓసారి క్వశ్చన్ మార్కు ఫేస్ పెట్టి జేబులోని చిల్లరలో నుండి ఏరీ మరీ ఓ పావలా కాసు తీసి పూజారి ముందున్న పళ్ళెంలో వేశాడు. పూజారి అసహ్యంగా ఫేస్ పెట్టి గున్నారావు చేతిలో ఓ డ్రాప్ తీర్థం విదిల్చి, శఠగోపంతో నెత్తిన ఒక్కటిచ్చి కోపంగా ఆశీర్వదించాడు.

గున్నారావుకు కళ్ళు గిర్రున తిరిగి దెబ్బకు క్రిందపడిపోయాడు.

నారాయణమ్మ కంగారు పడి గబగబా భర్తను బయటకు ఈడ్చుకొచ్చి, పంపులోని నీళ్ళు తెచ్చి మొహాన చల్లింది. కొంచెం సేపటికి గున్నారావు తేరుకున్నాడు. గున్నారావు ముక్కుతూ, మూలుగుతూ ఆ ప్రక్కనే వున్న మరో గుడిలోనికి వెళ్ళి చేతులెత్తి నమస్కరిస్తుంటే అక్కడ పూజారి ''నమస్కారాలు తరువాత ముందు డబ్బులెయ్, డబ్బులెయ్'' అంటు విసుక్కున్నాడు.

గున్నారావు అర్థరూపాయి తీసి పళ్ళెంలో వేసి భక్తిగా నమస్కరించాడు. అంతే! పూజారి పెట్టిన శఠగోపం విసురుకు క్రిందపడిపోయాడు.

''ఉన్నాడో పోయాడో చూడు తల్లి! ఒకవేళ వుంటే పోతాడేమో త్వరగా బయటకు తీసుకెళ్ళు'' కోపంగా అరిచాడు పూజారి.

తిరుపతి దగ్గరలో వున్న పుణ్యక్షేత్రాలన్నీ దర్శించుకుని అటునుండి బెజవాడ కనక దుర్గమ్మను దర్శించుకుందామని వచ్చారు. స్పెషల్ దర్శనం అయిదు రూపాయిలు దండుగ అనుకుని దర్మ దర్శనం కోసం క్యూలో నిలబడ్డారు. క్యూలో భక్తులు అంతగా లేరు. నారాయణమ్మ కొబ్బరి కాయ, పూలు అందించింది.

అక్కడ నిలబడి వున్న పూజారి ''మీ వారి పేరు చెప్పమ్మ!'' అన్నాడు

''ఛీ పాడు భర్త పేరు ఎవరైనా చెబుతారా ఏమిటి?'' సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది నారాయణమ్మ.

దూరంగా వున్న గున్నారావు తన పేరు చెప్పాడు.

అది పూజారికి వినిపించలేదు. ''ఆ మొహం చూస్తుంటే కొబ్బరికాయిలా వున్నది. కొబ్బరి కాయ నామధేయిస్య... గోత్రం చెప్పండి'' అరిచాడు పూజారి. గున్నారావు చెప్పాడు. అదీ వినబడలేదు. ఏదో ఒకటి దిక్కు మాలింది. గుమ్మడి కాయ గోత్రస్య... రెండు రూపాయలివ్వండి'' విసుగ్గా అడిగాడు పూజారి.

గున్నారావు రెండు రూపాయిలు తీసి యిచ్చాడు. పూజారి కొబ్బరికాయ చెక్కను నారాయణమ్మకు అందించి శఠగోపం తీశాడు. అంతే! గున్నారావు చేతులు తలకు అడ్డం పెట్టుకుని పెద్దగా అరచి దభీమని పడిపోయాడు. నారాయణమ్మ ఖర్మ—ఖర్మ అనుకుని విసుక్కుంటూ బయటకు ఈడ్చుకొచ్చింది.

★★★★

''అదండి సంగతి. ప్రతి గుడిలోనూ కానుకలు దండిగా యివ్వని కారణంగా శఠగోపం పెట్టి ఈయన్ని యిలా హింసించారు. తీరా యింటికి వచ్చిన తరువాత బాధ ఎక్కువై, తలవాచిపోయి స్పృహ తప్పి తలపట్టుకుని వద్దు వద్దు అని ఒకటే గోల చేస్తున్నారు. మీరే రక్షించాలి డాక్టరు గారూ!'' బావురుమన్నది నారాయణమ్మ.

డాక్టరమ్మ తేరుకుని ''ఈ దున్నపోతు డోసు ఇంజెక్షన్ నుండి మీరు రక్షింపబడాలంటే అలాంటి పూజార్ల నందరినీ తీసుకొచ్చి లైన్‌లో నిలబెట్టండి. వరస పెట్టి మరీ చంపుతాను'' హిస్టీరిక్‌గా అరిచింది.

(హాస్యం హాస్యం కథలపై పాఠకుల అభిప్రాయాలను ఈ విరునామాకు తెలియవేయగలరు. మహర్షి, ఎ.పి.యస్.ఆర్.ఎ.సి; *38*, నాగార్జునాహిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్)